రైతుల ఖాతాల్లో రూ. 53.36 కోట్లు జమ

ప్రజాశక్తి-విజయనగరం

వైయస్సార్ రైతు భరోసా - పిఎం కిసాన్ పథకం కింద జిల్లాలోని 2,51,659 మంది రైతులకు, రూ.53.36 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి విడుదల చేశారు. అర్హులైన ప్రతీ రైతు కుటుంబానికి ఏటా రూ. 13,500 చొప్పున అందిస్తున్నారు. రాష్ట్రంలోని భూ యజమానులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు, దేవాదాయ, అటవీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా అంతే మొత్తం రైతు భరోసాగా అందిస్తున్నారు. నాలుగో ఏడాది ఈ పథకం కింద మూడో విడతగా ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి రూ.53.36 కోట్లను జిల్లాలోని రైతులకు విడుదల చేశారు. దీనికి సంబంధించిన చెక్కును స్థానిక రైతు శిక్షణా కేంద్రంలో, వ్యవసాయాధికారులు రైతులకు మంగళవారం అందజేశారు.

చట్టసభల్లో ప్రజల గొంతు వినిపిస్తా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గజపతినగరం

ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల, పెన్షనర్ల సమస్యలను, బాధలను నేడు వినేవారే కరువయ్యారని, ఇలాంటి పరిస్థితుల్లో చట్ట సభల్లో అందరి గొంతుగా మన వాణి వినిపించాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. చట్ట సభల్లో ప్రశ్నించి, డిమాండ్లను సాధించుకునేందుకు పిడిఎఫ్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరంలోని విజ్జీ స్టేడియం, రాజీవ్‌గాంధీ స్టేడియంలో వాకర్స్‌ను, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న నిరుద్యోగులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ, నిరుద్యోగ యువతతో ర్యాలీ అవుతూ సమస్యలు తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. అందర్నీ పలకరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. నేడు ఉద్యోగుల సమస్యలు సిపిఎస్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యమని అన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్య పెట్టారని అన్నారు. ప్రచారంలో యువత, ఉద్యోగుల నుంచి విశేష ఆదరణ లభించింది. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సురేష్, వెంకటేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు భద్రత ఏదీ?

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని రమాప్రభ అన్నారు. గజపతినగరంలో ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించి అధ్యాపకులను, యాజమాన్యాలను కలుసుకున్నారు ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, సంక్షేమబోర్డు, సహాయ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినీ నెరవేర్చుకోవాలంటే శాసనమండలిలో మన గొంతు వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట ప్రజాసంఘాల నాయకులు జి. శ్రీనివాస్, వి.లక్ష్మి, డి.రాము, ఎస్.బంగారునాయుడు, ఎన్.నాయుడు పాల్గొన్నారు.

గజపతినగరం : ప్రైవేటు కళాశాలల అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతున్న కోరెడ్ల రమాప్రభ

విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం

కలెక్టరేట్‌లో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

జిల్లా కోర్టులో ప్రచారం

250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. జిల్లా కోర్టులో పలువురు న్యాయవాదులను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు న్యాయవ్యవస్థలో స్వతంత్రను రక్షించేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు, ఉత్తరాంధ్ర అభివద్ధి కోసం పోరాడుతున్న శక్తులకు అండగా ఉన్నది ఒక్క పిడిఎఫ్ ఎమ్మెల్సీలు లు మాత్రమేనని అన్నారు. రమాప్రభకు మద్దతుగా బొబ్బిలిలో కోర్టు వద్ద ప్రచారం చేశారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు శంకర్రావు మాట్లాడుతూ ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వృత్తిదారుల సమస్యలపై అవగాహన ఉన్న, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే రమాప్రభను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జగదీష్, మణికుమార్ ఉన్నారు.

పేదల భూములకు రక్షణ

భూసర్వే నమోదు ప్రక్రియ మరింత సరళతరం : సిసిఎల్ఎ కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం

పేదల జోలికి వెళ్లొద్దని, వారు సాగుచేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించాలని అధికారులను, ఆంధ్రప్రదేశ్ భూపరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. భూ కబ్జాలకు పాల్పడే మోతుబరులపై కఠిన చర్యలను తీసుకోవాలని సూచించారు. పేదలకు వ్యతిరేకంగా పనిచేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం క్రింద చేపట్టిన సమగ్ర భూ సర్వేపై, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వే, భూరికార్డుల కమిషనర్ సిద్దార్థజైన్ తో కలిసి, సిసిఎల్ఎ సాయిప్రసాద్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా మూడు జిల్లాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియ వివరాలను కలెక్టర్లద్వారా తెలుసుకున్నారు. భూ సర్వే ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించడంతోపాటు, వివరాలను మరింత సరళంగా నమోదు చేసే ప్రక్రియపై వివిధ స్థాయి అధికారులు, సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకున్నారు. నమోదు చేసే సమయంలో వారికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ మాట్లాడుతూ విఆర్ఒ లాగిన్‌లోని అంశాలను 38 నుంచి 20కి తగ్గిస్తామని చెప్పారు. భూముల కేటగిరీకి సంబంధించి అగ్రికల్చర్, హార్టికల్చర్ లేదా నాన్ అగ్రికల్చర్ విభాగాలను మాత్రమే ఉంచుతామని తెలిపారు. నీటి వనరులకు సంబంధించి మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ఆప్షన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతుల వ్యక్తిగత వివరాలను నమోదు చేసే ప్రక్రియను కూడా మరింత సరళంగా చేస్తామన్నారు. ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా 22 ఎలో నమోదు చేయాలని ఆదేశించారు. అసైన్డ్ భూమి కొన్నవారికి పిఒటి ప్రకారం నోటీసు ఇచ్చి, దానిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములను సాగు చేసుంటున్న నిరుపేదల జోలికి వెళ్లొద్దని సిసిఎల్ఎ స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్, మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జెసి ఒ.ఆనంద్, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, మూడు జిల్లాల సర్వేశాఖ ఎడిలు, తాహశీల్దార్లు, డిటిలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిసిఎల్ఎ కమిషనర్ సాయిప్రసాద్

కుష్టుపై నేటి నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో మార్చి 1 నుంచి 21వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు తెలిపారు. పట్టణ ప్రాంతాలైన విజయనగరం, నెల్లిమర్ల, బొబ్బిలి మరియు రాజాంలో 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి, వారికి మందులు అందజేస్తామన్నారు. కుష్టు నివారణకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది ఇంటింటికీ వచ్చినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలని కోరారు.

పొదుపు సంఘాల సొమ్ము రూ.18లక్షలు స్వాహా?

- **ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో అక్రమాలు**
- **గోప్యంగా ఉంచుతున్న బ్యాంకు అధికారులు**

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ పక్కనున్న ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సీతానగరం మండలానికి చెందిన జానుమల్లువలస, గాదెలవలస, తదితర గ్రామాల పొదుపు సంఘాలకు చెందిన డబ్బులు రూ.18లక్షలు వరకు కేంద్రం నిర్వాహకులు స్వాహా చేసినట్లు తెలిసింది. పొదుపు సంఘాలన్నీ బొబ్బిలి ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచిలో పొదుపు డబ్బులు కడతారు. వీరు డబ్బులు కట్టేందుకు మెయిన్ బ్రాంచికి వెళితే పక్కన ఉన్న ఖాతాదారుల సేవా కేంద్రంలో కట్టాలని బ్యాంకు అధికారులు సూచిస్తుంటారు. దీంతో మూడు నెలల నుంచి పొదుపు సంఘాల సభ్యులు కడుతున్న రుణాలు, పొదుపు సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా నిర్వాహకులు ఉంచేసుకుని స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వహకునిపై పొదుపు సంఘాల సభ్యులు బ్యాంకు అధికారులకు ఈమేరకు ఫిర్యాదు చేశారు.

బ్యాంకు అధికారులకు మహిళల ఫిర్యాదు

పొదుపు సంఘాల రుణాలు, పొదుపు సొమ్ము రూ.18లక్షలు వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారు కట్టిన డబ్బులు సంఘాల ఖాతాలో జమ కాకపోవడంతో సభ్యులు బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.అయితే ఖాతాదారుల సొమ్మును సేవా కేంద్రం నిర్వహకులు స్వాహా చేసిన విషయాన్ని బ్యాంకు అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. గతంలో ఇదే ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకులు సీతానగరం మండలం అంటిపేటలో సేవా కేంద్రాన్ని నడిపి అక్రమాలకు పాల్పడడంతో అక్కడ సేవా కేంద్రాన్ని ఎత్తి వేశారు. ఆ తరువాత బొబ్బిలి స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ పక్కన గత కొన్నేళ్లుగా ఖాతాదారుల సేవా కేంద్రాన్ని నడుపుతున్నారు.

ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రం

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించండి

మాజీ సైనికులు

ప్రజాశక్తి-విజయనగరం

తమ ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని జిల్లాలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఎక్స్ సర్వీస్‌మేన్ కోఆర్డినేషన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ బాడీ రాష్ట్ర అధ్యక్షులు (రిటైర్డ్ డిఐజి) టిఆర్ కె మూర్తి కోరారు. ఆయన అధ్యక్షతన నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాజీ సైనికుల కోసం సిఎస్‌డి క్యాంటీన్, ఆస్పత్రి ఏర్పాటు కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతి అందజేశారు. జిల్లాలో ఇళ్ల పట్టాలు పొందిన మాజీ సైనికులకు, అమరులైన సైనిక కుటుంబాలకు గాజులరేగలో ఇచ్చిన పట్టాల స్థానే స్థలాలు ఇవ్వాలని మంత్రి బొత్సను కోరారు. అందరికీ సబ్ డివిజన్ చేసి స్థలం ఇచ్చేందుకు మంత్రి అంగీకరించారు. వెంటనే ఆర్‌డిఒతో మాట్లాడి మాజీ సైనికుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు మాజీ సైనికుల నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాజులరేగ వద్ద స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోనల్ నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ప్రధాన సలహాదారు టి., మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాసులు, ఆడం రాజు, సాహు, పాల్గొన్నారు. కార్యక్రమం విజయనగరం జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవర ఈశ్వరరావు, కార్యదర్శి బి వెంకట్రావు ,ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులకు చెక్కు అందజేస్తున్న ధీరా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొత్స సందీప్

ఎస్ఎఫ్ఐకు ధీరా ఫౌండేషన్ లక్ష విరాళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులకు, ప్రజలకు అనేక రకాలుగా సేవలందిస్తున్న ఎస్ఎఫ్ఐకు ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా ధీర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొత్స సందీప్ విద్యార్థుల భవిషత్తు కోసం లక్ష రూపాయల విరాళాన్ని మంగళవారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నామని, నిరుద్యోగులకు వృత్తి విద్య శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ ఇప్పించి వారిని ఆదుకుంటామని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమైన వారికి కోచింగ్ సెంటర్ల ద్వారా నాణ్యమైన కోచింగ్ అందించి వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భవిషత్తులో యువతకు అండగా ఉంటామని, వారికి ఉపయోగపడేలా మరెన్నో సేవ కార్యక్రమాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా క్యాదర్శి పి.రామ్మోహన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిఎల్‌జె నాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు సోమేశ్వరరావు, ధీర ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ సంఘం సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మంగళవారం బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో గాయత్రీ భవనంలో సమాఖ్య కోశాధికారి ఎం.ఆర్.ఎల్ కుమార్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద బ్రాహ్మణులకు అండగా ఉంటూ, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వారికి చేయూతనివ్వడం హర్షనీయమన్నారు. సమాఖ్య ద్వారా ఉచిత వైద్య శిబిరాలతో పాటు, నిరుపేద బ్రాహ్మణులకు ఉచితంగా ఉపనయనాలు, వివాహాలు జరిపించడం, ప్రతిభగల బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం లాంటి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ డివి శ్రీకాంత్ నేతృత్వంలో 15 మందితో కూడిన వైద్య బృందం రోగులకు అవసరమైన పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆల్ఫా స్కాన్ ద్వారా ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షులు బాబూజీ, ప్రోగ్రాం చైర్మన్ దవళ వెంకట్రావు, కార్యదర్శి ఇనుగంటి రమేష్, ఉపాధ్యక్షులు భరద్వాజ చక్రవర్తి పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు చెప్పారు. మంగళవారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా నూతన అధ్యక్షులుగా కెల్ల శ్రీనివాసరావు నియమిస్తూ నియామక పత్రం అందించారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా చలమూరి వెంకట రావును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలు పల్లకిలు మోసే బోయలుగా మిగులుతున్నారన్నారు. బిసిలకు రాజ్యాధికారం దిశగా ఆలోచనలు చేస్తున్నా మన్నారు. ఉభయ రాష్ట్రాల్లో ఉన్న 296 అసెంబ్లీ స్థానాలకు గాను 150 స్థానాలు బిసిలకు చెంది ఉండాలన్నారు. బిసిల రిజర్వేషన్ కోసం ఏర్పాటుచేసిన బిపి మండల్ సూచనలను కేంద్ర మంత్రిమండలి ఆమోదించి మూడు దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ రిజర్వేషన్లు పూర్తిస్థాయి అమలుపై కేంద్ర ప్రభుత్వం మేనమేషాలు లెక్కిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జి సూరిబాబు, ఎస్. శ్రీనివాసరావు, తోటపల్లి బుజ్జి బాబు, బొబ్బాది సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల అనుమతులన్నీ ఒకేచోట

- **స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలి**
- **ఫిర్యాదులపై తక్షణం స్పందించి విచారణ చేయాలి**
- **ఎన్నికల పరిశీలకులు సిద్ధార్ద్ జైన్ ఆదేశం**

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో శాసనమండలి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల నోడల్ అధికారులు చర్యలు చేపట్టాలని శాసన మండలి ఎన్నికల పరిశీలకులు సిద్దార్ద్ జైన్ ఆదేశించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా అభ్యర్థులందరికీ అనుమతుల విషయంలో సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులన్నీ ఒకేచోట ఇచ్చేందుకు సింగిల్‌విండో పద్ధతిని అనుసరించా లన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల పరిశీలకులు సిద్దార్ద్ జైన్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశమై ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. పతి ఫిర్యాదుపై త్వరగా విచారణ జరిపి జాప్యం లేకుండా నివేదికలు ఇవ్వాలన్నారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సుల సరఫరాపై విశాఖలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమన్వయంతో వ్యవహరించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఒడిశా నుంచి అక్రమ మద్యం సరఫరాకు తావులేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను సమకూర్చుకోవాలని, పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు 37మంది అభ్యర్థులు బరిలో వున్నారని, పెద్ద సైజు బ్యాలెట్ వచ్చే అవకాశం వున్నందున ఆ మేరకు తగిన సైజుగల బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

ఎంఎల్‌సి ఎన్నికలను ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు ముందుగానే ప్రతి పాయింట్‌ను చదివి అర్థం చేసుకోవాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జోనల్ అధికారులకు, ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 72 పోలింగ్ స్టేషన్లు ఉండగా సరాసరిగా వెయ్యి మంది ఓటర్లు ఉన్నారని, 12 పోలింగ్ స్టేషన్లలో వెయ్యి ఓట్లు దాటి ఉన్నాయని, వీటి వద్ద రెండు బ్యాలెట్ పెట్టెలను ఇచ్చిందని, అవసరమైతే అదనపు పెట్టెలు కూడా జోనల్ అధికారి ఆధ్వర్యంలో ఉంచామని తెలిపారు. వెయ్యి ఓట్లు దాటి ఉన్న చోట రెండేసి ఓటింగ్ కంపార్ట్మెంట్ లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ సిబ్బంది క్రమశిక్షణగా ఉండాలన్నారు.అంతకు ముందు డిప్యూటీ కలెక్టర్ పద్మలత ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని, 4 గంటలకు క్యూ లో ఉన్న ఓటర్ల కు స్లిప్ లు ఇచ్చి ఓటింగ్ పూర్తి అయిన తర్వాత ముగించాలని తెలిపారు. డిఆర్ఒ గణపతి రావు, జోనల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధార్ద్ జైన్

గుండెపోటుతో సంగీత కళాశాల ప్రిన్సిపల్ మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వి.ప్రసన్న కుమారి (56) మంగళవారం ఉదయం లక్కపందిరివారివీధిలో గల తన నివాసంలో గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. ఉదయం 11గంటల సమయంలో కాఫీ తాగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రసన్నకుమారి ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలకు 2021వ సంవత్సరం లో 15వ ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరారు. ప్రముఖ నాట్యకారిణి అయితం అప్పలరాజు కుమార్తె. ఆమెకు భర్త శ్రీకాంత్, కుమారులు శ్రావణ్, ధీరజ్ ఉన్నారు. సంగీత కళాశాలలో భరత నాట్య అధ్యాపకులుగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై రాజమండ్రి సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. అక్కడ నుంచి 2021 జులై 5న మహారాజా ప్రభుత్వ సంగీత నత్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు. పదోన్నతి పై వచ్చారు. ప్రసన్నకుమారి మృతితో కళాకారులు, సంగీత ప్రియులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.ప్రసన్నకుమారి మృతికి కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి -విజయనగరం కోట, గుర్ల

నగరంలోని బాలాజీ జంక్షన్ వద్దగల ఎల్లమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. వేలాది మంది అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు.

ఘనంగా సిరిమానోత్సవం

గుర్ల మండలంలోని పల్లిగండ్రేడు గ్రామం లో ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. వందలాది మంది అమ్మవారిని దర్శించుకుకొని మొక్కులు తీర్చుకున్నారు. జామి వారి ఇంట వెలసిన ఎల్లమ్మ సిరిమానును పూజారి ఉర్లాపు రామారావు (రాము) అధిరోహించి భక్తులకు ఆశీర్వాదం అందించారు. ఈ యాత్రకు చుట్టుపక్కల ఇరవై గ్రామాల నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. .గ్రామ పురవీధుల నుండి రథం అమ్మవారి గుడికి చేరుకుంది.

పారాది వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

బొబ్బిలి : పారాది వద్ద మంగళవారం ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పారాది గ్రామదేవత పండుగ జరుగుతున్నందున వాహనాలు రద్దీ పెరిగి ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు ట్రాఫిక్ ఎస్ఐ పోలినాయుడు, సిబ్బంది ప్రయత్నం చేసినప్పటికీ వాహనదారులు అడ్డగోలుగా వాహనాలను డ్రైవ్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

బొబ్బిలి : పట్టణంలోని పలు వార్డుల్లో కమిషనర్ శ్రీనివాసరావు మంగళవారం పర్యటించారు. చాకలి వీధిలో పర్యటించి వీధి దీపాలు వెలుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కుళాయిలు సక్రమంగా వస్తున్నాయా లని అడిగారు. ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు వచ్చి చెత్తను సేకరించి, ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రపరుస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెలమవారి వీధిలో ఇంటి నుండి మురుగు నీరు విడిచి పెట్టె కాలువ విషయమై రెండిళ్ల మధ్య తలెత్తిన వివాదం వల్ల కోర్టు ద్వారా ఇంజెక్షన్ ఆర్డరు తెచ్చుకున్న ఇళ్లను టౌన్ ప్లానింగ్ సూపర్ వైజరుతో పరిశీలించి ఉభయ పార్టీలతో చర్చించారు.

నవధాన్యాలపై రైతులకు అవగాహన

వేపాడ : మండలంలోని బొద్దాం గ్రామంలో నవధాన్యాల సాగుపై సుస్థిర వ్యవసాయ కేంద్రం(సిఎస్ఎ) రీజనల్ కోఆర్డినేటర్ పి వెంకటరావు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎకరానికి 30 రకాల విత్తనాలు 13 కేజీలు వరి పంటకు ముందు వేసి కలియదున్నాలన్నారు. అలా చేస్తే నేల గొల్ల భారీ తేమ శాతం తట్టుకొని పంటల బాగా పండుతాయన్నారు. నేలలో వానపాములు బాగా పెరిగి 10 నుండి 15 టన్నులు పచ్చి రొట్టె ఎరువు తయారవుతుందన్నారు. అనంతరం నవధాన్యాలు సాగు చేద్దాం.. నేలతల్లిని కాపాడుకుందాం అనే నినాదాలతో ప్రతిజ్ఞ చేయించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

శృంగవరపుకోట : పట్టణంలోని శాఖ గ్రంథాలయానికి కాంపిటేటివ్ ఎగ్జామ్‌కి ఉపయోగపడే ఐదువేల రూపాయల విలువైన పుస్తకాలను న్యాయవాది బొబ్బిలి చంద్రశేఖర్ అందజేశారని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కి ఉపయోగపడే పుస్తకాలను శాఖ గ్రంథాలయానికి వితరణ చేయటం ఎంతో గొప్ప విషయమన్నారు. పుస్తకాలను అందించిన బొబ్బిలి చంద్రశేఖర్‌ను గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ అభినందించారు.

వైసిపి యూత్ మండల అధ్యక్షుడిగా ఉగ్గిన శ్రీను

వేపాడ : మండల వైసిపి అధ్యక్షుడిగా సోంపురం గ్రామానికి చెందిన ఉగ్గిన శ్రీను నియమితులయ్యారు. తనపై నమ్మకంతో మండలయూత్ అధ్యక్షులుగా నియమించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు రుణపడి ఉంటానన్నారు.

చెరువు గట్టు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: పట్టణ నడిబొడ్డున ఉన్న అమ్మిగారి చెరువు గట్టు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, పాలవలస ఉమా, ఎస్.బాబు, ఎస్.లక్ష్మీ, ఒమ్మి లక్ష్మీ డిమాండ్ చేశారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న చెరువు గట్టు ఆక్రమణకు గురవుతున్న పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రూ. కోట్లు విలువ చేసే స్థలాలను ఆక్రమణ చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. చెరువు 22ఏలో ఉన్న ఆక్రమణదారులకు పట్టాలు, పొజిషన్ పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాడ పల్లి మనోజ్ కుమార్, దిబ్బ గోపి, ఒమ్మి రామారావు, సిహెచ్ రాజగోపాల్ ఉన్నారు.

కాలుష్య సమస్యపై గ్రామస్తుల ఆందోళన

పూసపాటిరేగ : మండలంలోని అల్లాడపాలెం గెడ్డ కాలుష్యంతో నిండిపోతుందని వైస్ ఎంపిపి అల్లాడ సత్యనారాయణ మూర్తి, సర్పంచ్ అల్లాడ సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులంతా పార్టీలకతీతంగా ఆందోళన చేశారు. శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్, ఆంధ్రా ఆర్గానిక్స్, అరబిందో తదితర పరిశ్రమల నుండి వ్యర్థ జలాలను గెడ్డలోకి వదిలేస్తున్నారన్నారు. తద్వారా గెడ్డంతా వ్యర్థ జలాలుతో నిండిపోతుందన్నారు. ఈ వ్యర్థ జలాలు వల్ల తమ గ్రామంలో భూగర్భ జలాలు కలుషితమై అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. గెడ్డలోకి వదిలేస్తున్న వ్యర్థ జలాలు తాగి పశువులు చనిపోతున్నాయన్నారు. ఈ వ్యర్థ జలాలను అరికట్టేందుకు పరిశ్రమలకు వినతి పత్రాలను ఇవ్వాలని నిర్ణయించామని వైఎస్ ఎంపిపి సత్యనారాయణ మూర్తి తెలిపారు. అనంతరం డాక్టర్ రెడ్డీస్, ఎఐఎల్ పరిశ్రమల గేటు దగ్గరకు వెళ్లి వ్యర్థ జలాల సమస్యను వివరించారు. రెడ్డీస్ యాజమాన్య ప్రతినిధి కెవిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఈ సమస్యపై కమిటీ వేద్దామన్నారు. ఎక్కడ నుండి వ్యర్థ జలాలు వస్తున్నాయో తెలుసుకొని శాశ్వత పరిష్కార మార్గం ఆలోచన చేద్దామన్నారు. ఆ సమావేశానికి పిసిబి వారిని పిలిచి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునే ప్రయత్నం చేద్దామని చెప్పడంతో వారంతా వెనుదిరిగారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కౌన్సిల్

నెల్లిమర్ల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 5వ జిల్లా కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలని ఆ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా కౌన్సిల్ సమావేశాల వాల్ పోస్టర్ సంఘం ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లడుతూ ఈ నెల 2న జిల్లా కేంద్రం కృషి భవన్‌లో సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశాలకు రాష్ట్ర అధ్యక్షులు కె. ఆర్ సూర్యనారాయణ హజరవుతారని చెప్పారు. నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్ దార్లు హాజరై విజయవంత చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాలూకా అద్యక్షులు పివి దొర, సహా అద్యక్షులు హెచ్. భానోజీరావు కార్యదర్శి టి. శివప్రసాద్, పాల్గొన్నారు.

పింఛన్ రూ.9వేలు అమలు చేయాలి

నెల్లిమర్ల : కార్మికులకు కనీస పింఛన్ రూ.9వేలు అమలు చేయాలని ఈ పిఎస్ పింఛన్ల దార్ల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ ఈపిఎస్ పింఛన్‌దార్లు దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతుంటే ఈపిఎస్ సంస్థ సుప్రీం కోర్టు మార్గ దర్శకాల పేరిట ఉద్యోగులను, కార్మికులను గందర గోళానికి గురి చేయడం సమంజసం కాదన్నారు. కాబట్టి పెరుగుతున్న ధరలను బట్టి కనీస పింఛన్ రూ. 9వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఆధునిక భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సివి రామన్ అగ్రగామిగా నిలిచాడని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో రామన్ ప్రభావం ఎంతగానో ఉందన్నారు. విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ అందుకున్న మొట్టమొదటి, ఏకైక ఆసియా వాసిగా సర్ సీవీ రామన్ రికార్డు సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ, డీన్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల అధ్యాపకులు జీవన్ కుమార్, ప్రధాన అధ్యాపకులు మహ్మద్ జాకీరుల్లా, సెంచూరియన్‌కు చెందిన పర్లాకిమిడి, భువనేశ్వర్ క్యాంపస్ అధ్యాపకులు, డీన్ సన్నీడియోల్, విజయ్ బాబు, ప్రొఫెసర్ సతీష్, ప్రొఫెసర్ మురళీ, డీన్ పుష్పలత, రమ్య, డీన్ ఎంఎల్ఎన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి విద్యార్థులు సైన్సుపట్ల అవగాహన కలిగి ఉండాలని బీమవరం ప్రభుత్వం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెంటు సత్యం తెలిపారు. పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు తిలకించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను పరిశీలించి వాటిని తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విజ్ఞానశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పేడాడ, గుండాలపేట, వెదుళ్ళవలస, చింతలవలస, దిబ్బగుడ్డి, చిట్టిగుంకలాం, వెంకన్న పేట, గొడ్డుపాలెం పాఠశాలల నుంచి కూడా విద్యార్థులు పలు ప్రదర్శనలు చేపట్టారు. విద్యార్థులంతా కలిసి 72 ప్రదర్శనలును చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సౌభాగ్యలక్ష్మి, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ మోహన్, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు గీతాలక్ష్మి, యశోద, దుర్గామహేష్, రజిని పాల్గొన్నారు.

భోగాపురం: మానవాళి మనుగుడకు సైన్స్ ఎంతో అవసరమని ముక్కాం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ గుడివాడ శ్రీదేవి అన్నారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సి.వి. రామన్ జయంతి సందర్భంగా మండలంలోని ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు గుడివాడ శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన పలు ప్రాజెక్టులు గాలిమర, పవన్ విద్యుత్, కిరణజన్య సంయోగ క్రియ, బెలూన్ రాకెట్, నీరు, గాలి కాలుష్యం, సూక్ష్మ దర్శిని మొదలైన ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకున్నాయి. ఇందులో ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు వి.అనసూయ, సరస్వతి, ఎస్ భవాని, పడాల చంద్రశేఖర్, సూర్యకాంతం, గణపతి, కె.లక్ష్మణరావు, ఆర్ శ్రీనివాసరావు, సిఆర్‌పి మాతా శేషుబాబు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ చండా కేశవ రావు అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి రామన్ ఆవిష్కరణను పురస్కరించుకొని ప్రజలలో శాస్త్రీయ అవగాహనను పెంపొందించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ సివిఎస్ రవీంద్రనాథ్, కె. వాసు దేవ రావు, జి. ఈరన్న, చల్లా శ్రీనివాసరావు, బి. సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు. నారాయణ పాఠశాలలో సైన్సు డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సి. హెచ్.శేషు, పాఠశాల ఎ.జి.ఎం. శివరాం, శ్రీనివాసరావు, రీజనల్ ఇంచార్జ్ రవికుమార్, కో-ఆర్డినేటర్ గ్రేసీ, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎ.యన్.ఆర్.లక్ష్మీ, రోజా, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: విద్యార్థులకు చిన్న వయసులోనే విషయ పరిజ్ఞానం ఎంతైనా అవసరమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస సబ్బవరం రోడ్‌లోని శ్రీ గాయత్రీ విద్యా మందిర్ స్కూల్ నేషనల్ సైన్స్ డే సంద్భంగా మంగళవారం నిర్వహించిన 'సైన్స్ ఎక్సిబిషన్'ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. పూర్ణ, డైరెక్టర్స్ కె.కె.ఎం రమేష్, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, లెంక రామ్మనపాత్రుడు, పిఎస్ఎన్ పాత్రుడు, వల్లెపు కైలాష్, బొంతల వెంకటరావు, పూసర్ల రఘు, ఏడుకొండలు, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సోంపురం, బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ ఆదర్శ పాఠశాల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికలు వసతి గృహంలో, కేజీబీవీ బాలికల వసతి గృహంలోనూ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఓక్లాండ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంటు డాక్టర్ పాల్ శ్రీనువాసరావు ఈ ప్రదర్శనలను ప్రారంబించారు. వందల మంది విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. సుమారుగా 300 ప్రాజెక్టలను తయారు చేసి ప్రదర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పిఎస్ఎల్‌వి ర్యాకెట్ నమూనా ఆకట్టుకొంది. పిల్లలు తయారు చేసి వివరిస్తున్న ప్రాజెక్టలను చూసేందుకు వందలాది మంది తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శివ, ప్రిన్సిపాల్ సిహెచ్ రవి, ఉపాధ్యాయులు, విధ్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఆంధ్ర ప్రదేశ్ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనివర్సిటీ కులపతి ప్రొఫెసర్ టి.వి. కట్టిమనిప్రారంభోపన్యాసం చేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీని ఇతర శాఖలతో అనుసంధానం చేసి స్థిరమైన అభివృద్ధి కోసం కొత్త ఆవిష్కరణలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఐఎస్ఏఐ ఫార్మాస్యూటికల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్ దీక్షిత్, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పల్లవి విద్యామందిర్‌లో..

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక పల్లవి విద్యామందిర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్పో విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన వివిధ అంశాలతో కూడిన ప్రాజెక్టులు ఆసక్తి రేకెత్తించాయి. సుమారు 150 రకాల సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎస్. శేఖర్, ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, సచివాలయ ఎడ్యుకేషనల్ సెక్రటరీ పి. విష్ణు గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సత్య కళాశాలలో..: స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తత్వం మొదలైన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్యవేణి, ఎం ఉదయ్ కిరణ్, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి. సూరపు నాయుడు, సైన్స్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురజాడలో..: గురజాడ పాఠశాలలో 'సైన్సు దినోత్సవం' పూండి శేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. జెవివి జాతీయ సలహాదారులు కృష్ణాజీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ స్వరూప, సైన్సు ఉపాధ్యాయులు రమేష్, ఎం. దీప్తి, డి. లక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: చీకటి నుంచి వెలుతురును ప్రసాదించిందే సైన్స్ అని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. మంగళవారం స్థానిక గాజుల రేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో సివిరామన్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఓజోన్ పోర ఎఫెక్ట్, చెత్త సేకరణ నమూనా, స్మార్ట్ సిటీ మిషన్, నీటి శుద్ధి యంత్రం ఆకట్టుకున్నాయి. విజయనగరం రింగురోడ్డు శ్రీచైతన్య పాఠశాలలో సైన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఫోర్టు సిటీ స్కూల్లో : జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కెవిపి రాజు, వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ గిరిజారాణి, అకాడమిక్ అడ్వయిజర్ రోజయినా ఖాన్, డైరెక్టర్లు మధు అశోక్, నీలిమా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్సు దినోత్సవం

కొత్తవలస: విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టును చూస్తున్న ఎమ్మెల్యే కడుబండి

డెంకాడ : గెలిపొందిన విజేతలతో ఉపాధ్యాయులు

పూసపాటిరేగ: ఓక్లాండ్ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు

విజయనగరం: పోర్టు సిటీ స్కూల్లో గెలిపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

జాతీయ అవార్డుకు ఉమామహేశ్వరి ఎంపిక

రేగిడి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయిని బూరివిల్లి ఉమామహేశ్వరి 'సారాభాయ్' జాతీయస్థాయి సైంటిస్ట్ అవార్డుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు రామినాయుడు తెలిపారు. దేశ వ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు పోటి పడినా సారాభాయ్ టీచర్ సైం టిస్ట్ నేషనల్ అవార్డుకు తమ పాఠశాలలో పనిచేస్తున్న సైన్సు టీచర్ ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించ డానికి జాతీయ, రాష్ట్ర, పాఠశాల స్థాయిలో ఆమె చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఇస్రో, డిఎస్టి, ఎన్‌సిఇఆర్‌టి సైంటిస్టులు జ్యూరీ సభ్యులుగా ఇంటర్వ్యూ నిర్వహించి ఆమెను అభినందిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. ఈ అవార్డుకు మూడు స్థాయిలలో ఎంపిక ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహించారన్నారు. ఈ మేరకు ఆమెను ఎంపిపి అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్. రామినాయుడు, సిబ్బంది, మండల విద్యా శాఖాధికారి ఎంవి ప్రసాద్‌రావు, జిల్లా సైన్స్ ఆఫీసర కృష్ణారావు, వివిఎమ్ స్టేట్ కోఆర్డినేటర్ ఎ.పున్నయ్య, సర్పంచ్ కిమిడి రవిశంకర్, విద్యా కమిటీ చైర్మన్ ఎం. రామకృష్ణ అభినందించారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

నెల్లిమర్ల : మండలంలోని మొయిద, జరజాపు పేట గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించారు. మొయిదలో ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు సహకారంతో అనిల్ నీరు కొండ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో గుండె, ఎముకలు, గైనిక్, సుగర్, బిపిలకు పరీక్షలు, జరజాపు పేటలో ఆపిల్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. మొయిదలో 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 32మందికి వివిధ రకాల రోగాలు గుర్తించి ఉచిత వైద్యం అందిస్తామని అనీల్ నీరు కొండ ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ పృధ్వి తెలిపారు. దంత వైద్య శిబిరంలో ఆపిల్ డెంటల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కళ్యాణ్ చక్ర వర్తి, డాక్టర్ జగన్ 75మందికి ఉచిత దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొయిదలో జరిగిన శిబిరంలో పిఆర్ఒ త్రినాథ్, సర్పంచ్ అట్టాడ కృష్ణ, పెద్దలు యడ్ల కృష్ణ, ధవళ లక్ష్మణరావు, అట్టాడ శ్రీను, జరజాపు పేటలో గ్రామ పెద్దలు సముద్రపు రామారావు, పాల్గొన్నారు.



వృద్ధుడిని తనఖీ చేస్తున్న వైద్యుడు

ప్రజాశక్తి విలేకరికి వైసిపి నాయకుడు బెదిరింపులు

లక్కవరపుకోట: లక్కవరపుకోట ప్రజాశక్తి విలేకరి పి. శ్రీనివాసరాజును మండలానికి చెందిన వైసిపి నాయకుడు కూరాకుల సూర్యారావు అలియాస్ సూరితాత బెదిరించారు. ఈనెల 25న 'వైసిపిలో గ్రూపుల పోరు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన సూరితాత మంగళవారం ఉదయం ఎంపిడిఒ కార్యాలయం వద్ద విలేకరిని అడ్డగించి చంపుతానని బెదిరించాడు. దీనిపై శ్రీనివాసరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వార్తను ఉద్దేశించి 'ఏంటిరా నీ రాతలు, ఒళ్ళు దగ్గర పెట్టుకుని వార్తలు రాయరా, మా పార్టీలో గ్రూపుల గురించి నీకెందుకురా, చిరిగిన ఫ్లెక్సీలకు నీకు సంబంధం ఏంటిరా', అంటూ తనను బెదిరించాడని శ్రీనివాసరాజు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమ కళ్యాణ మండపం వద్దకు వస్తే నీసంగతి చూస్తానంటూ బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు రక్షణ కల్పించి సూరితాతపై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఎస్ఐ ఎం.ముకుందరావు స్పందిస్తూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం

వేపాడ : మండలంలో గల 18 గ్రామ సచివాలయాల్లో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్లతో మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక పింఛన్లు పంపిణీ, ఆయుష్మాన్ భవ, ఇకెవైసి, ఎస్‌డిజి సర్వే వంటి విధి నిర్వహణపై వివరించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు తప్పనిసరిగా గ్రామ సచివాలయ వాలంటీర్ల సహాయం తీసుకుని పనిచేయాలని సూచించారు.

గుజరాత్ సముద్రంలో మరో మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లికి చెందిన మరో మత్స్యకార యువకుడు బర్రి అప్పన్న (30) గుజరాత్ రాష్ట్రంలోని వీరవల్లి సముద్రంలో వేటాడుతుండగా అదుపుతప్పి సముద్రంలో పడి మృతి చెందాడు. నాలుగు రోజుల కిందటే కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు సముద్రంలో పడి ఓ యువకుడు యువకుడు చెందగా, మంగళవారం మరో యువకుడు గుజరాత్ రాష్ట్రంలోని హేరావాలి సముద్రంలో మృతి చెందడం మత్స్యకారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. అప్పన్న సముద్రంలో చేపల వేట చేస్తుండగా సముద్రంలో జారి పడిపోయి మరణించాడని తోటి మత్స్యకారులు చెబుతున్నారు. వేటకోసం వలసలు వెళ్లి దిక్కు లేని వికట జీవులు గా మిగిలి పోతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. చింతపల్లిలో జెట్టీ నిర్మిస్తామని, తద్వారా వలసలు నివారిస్తామని పాలకులు చెప్పినా అమలు కాకపోవడంతో ఉపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. వారంరోజుల క్రితం ఇదే పంచాయతీకి చెందిన బెవర మసేను (24) మంగుళూరు జెట్టీ వద్ద మృతి చెందాడని, వలస వెళ్లిన వారు బతుకులు ఇంతేనా? అంటూ మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న వాపోతున్నారు. చింతపల్లిలో జెట్టీ నిర్మాణం వేగవంతం చేసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.

బర్రి అప్పన్న

ఫిర్యాదుపై పరిశీలన చేయండి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

దళితల ఇండ్ల స్థలాలు కోసం కేటాయించిన భూమిని అమ్మేస్తున్నామంటూ తమపై వచ్చిన ఫిర్యాదుపై పరిశీలన జరపాలని నడిపల్లి సర్పంచ్ భర్త లంకలపల్లి శ్రీనువాసరావు మంగళవారం తహశీల్దార్‌కు వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో దళితుల ఇళ్ల స్థలాలు కోసం కేటాయించిన భూమిని లంకలపల్లి నారాయణమ్మతో కలసి అమ్మేస్తున్నామంటూ తనపై ఫిర్యాదు అవాస్తవమన్నారు. రాజకీయంగా తమని గెలవలేక ఇలాంటి నీచ ప్రచారానికి దిగుతు తమ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమపై తప్పుడు ఫిర్యాదు చేసిన లంకలపల్లి రామారావు, అచ్చున్న, క్రిష్ట, సురేష్‌కుమార్, గోపిశెట్టి మహేష్‌ను విచారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ ప్రతిష్ట దిగజార్జేందుకే ఈ ఆరోపణలు అని ఆ గ్రామ దళితలు గంట్లాన అప్పయ్యమ్మ, పచ్చిపాల సన్యాసి, పచ్చిపాల అప్పారావు తహశీల్దార్‌కు తెలిపారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక కోటి చెరువు సమీపంలో ఉన్న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2019, 2020, 2021, 2022లో ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటి దగ్గర నుంచి పని చేసే వారికి రూ.3.2 లక్షల నుంచి రూ.5.5లక్షలు వరకు, ఆఫీసులో పని చేసే వారికి రూ.9.5లక్షల నుంచి రూ.11 లక్షలు వరకు ఏడాదికి వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు గురువారం కళాశాల వద్ద జరగనున్న ఇంటర్వ్యూలకు బయోడేటాతో హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు ఎంఎన్‌సి కంపెనీలో ఉద్యోగాలు ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు 94409 21855 ను సంప్రదించాలని కోరారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

మొక్కజొన్న చేనులో చీర కొంగుతో గొంతు నులిమి హత్య : సిఐ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొండచాకరాపల్లిలో వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర రావు, వంగర ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన 68 ఏళ్ల బూరాడ చిన్నంనాయుడుతో అదే గ్రామానికి చెందిన మృతురాలు గంట చిన్నమ్ముడు(62)కు గత కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. మృతురాలి భర్త అప్పలనాయుడు గతంలోనే మృతి చెందాడు. దీంతో చిన్నంనాయుడుతో విహేతర సంబందం పెట్టుకుంది. మండలంలోని నీలయ్య వలసలో నివాసం ఉంటున్న తన చిన్న కుమార్తె సతిపిడకల పుణ్యవతి వద్ద చిన్నమ్ముడు ఉండేది. దీంతో చిన్నంనాయుడికి చిన్నమ్ముడికి దూరం పెరగడంతో విభేదాలు వచ్చాయి. ఫిబ్రవరి 20న చిన్నమ్ముడు తన కుమార్తె గ్రామం నుంచి స్వగ్రామం కొండచాకరాపల్లి వచ్చింది. కొద్దిసేపటి అనంతరం వీరిద్దరూ సువర్ణముఖి నది వద్ద కలుసుకున్నారు. మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జొన్న సేను పొలం వద్ద కలుసుకుందామని నిర్ణయించుకున్నారు. అనుకున్న సమయానికి వీరిద్దరూ అక్కడకు చేరుకున్నారు. తనకు దూరమై ఇంకొంతమందితో తప్పుగా తిరుగుతున్నావని నీ బండారం బయట పెడతానని చిన్నమ్ముడు చిన్నంనాయుడిని హెచ్చరించడంతో కోపోద్రిక్తుడైన చిన్నంనాయుడు ఆమె చెంపపై కొట్టాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి జారుకుంది. ఆమెకు స్పృహ లేదని గుర్తించిన చిన్నంనాయుడు ఆమె చీర కొంగుతో గొంతు చుట్టూ చుట్టి నులిమి చంపేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న మూడు తులాలకు పైగా బంగారు ఆభరణాలు అపహరించుకొని అక్కడి నుండి వెళ్ళిపోయాడు. తన తల్లి కనిపించడంలేదని ఫిబ్రవరి 20న తన కుమార్తె పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానితులను విచారించారు.

తప్పుడు బిల్లుతో చిక్కిన నిందితుడు

విచారణలో భాగంగా పోలీసులు చిన్నంనాయుడుని విచారించారు. మృతురాలిని చివరిసారిగా ఎప్పుడు చూసావని ప్రశ్నించారు. కొన్ని నెలలు అయిందని సమాధానం ఇచ్చాడు. కాగా ఆమె చనిపోయిన రోజు తాను పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండల కేంద్రంలో ఉన్న ఎరువులు దుకాణానికి వెళ్లానని అక్కడ యూరియా బస్తా కొనుక్కొని వచ్చానని దానికి సంబంధించిన బిల్లును కూడా పోలీసులకు చూపించి నమ్మబలికాడు. అనుమానం వచ్చిన పోలీసులు దుకాణం యజమానిని ప్రశ్నించగా ఆయన ఆ రోజు రాలేదని మరుసటి రోజు వచ్చి యూరియా బస్తాను కొని ముందు రోజు తేదీ వేసి బిల్లు ఇస్తే తనకు ప్రభుత్వ రాయితీ వస్తుందని చెప్పి తేదీ మార్పించాడని చెప్పాడు. ఈ విషయాన్ని చిన్నంనాయుడు వద్ద పోలీసులు ప్రస్తావించగా ఆశ్చర్యానికి గురై జరిగిన వివరాలన్ని వెల్లడించాడు. చిన్నమ్ముడును తానే హత్య చేసి, బంగారు ఆభరణాలు తీసుకున్నట్లు పోలీసులు ఎదుట ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి పాలకొండ జ్యూడిషియల్ కస్టడికి తరలించామని సిఐ తెలిపారు.

PUBLIC NOTICE FOR CLOSURE OF BRANCH

Dear Stakeholders, Thank You for your trust in Orange Retail Finance India Private Limited (ORFIL) and for choosing ORFIL as your preferred Neighbourhood Financier. We wish to inform that we are closing our below mentioned Branches in Andhra Pradesh for ease of business operations with effect from **31st May 2023.**

1. 1st Floor, Door No.23B/4/61, Subbama Devi School Road, RR Pet, Eluru, West Godhavari, Andhra Pradesh - 534 002.
2. Shop 1&2, 2nd Floor, Skanda shopping Mall, Near Congress Office, Old Chand Talkies, Kurnool, Andhra Pradesh – 518001.
3. 1st Floor, Door No.12-4-23/6&23-7, G.T.Road,Srikakulam, Andhra Pradesh-532001.

All Customer Accounts handled by our Eluru Branch will be automatically transferred to our Vijayawada Branch located at Door No.52-1/1-C, Veternary Colony, Eluru Road, Service Road, Vijayawada, Andhra Pradesh – 520008 and All Customer Accounts handled by our Kurnool Branch will be automatically transferred to our Ananthapur Branch located at 2nd Floor, Door No.14/228, Kamala Nagar, Near Varun Hospital, Ananthapur, Andhra Pradesh– 515 001 and All Customer Accounts handled by our Srikakulam Branch will be automatically transferred to our Visakhapatnam Branch located at 1st Floor, Coastal Heights, Door No.49-24-62, Shankaramatam Road, Visakhapatnam, Andhra Pradesh - 530 016.

In case of any query please reach out to the below-mentioned personnel:-

Name of the Contact Person	Praveen kumar kodandan
Contact No:	97033 33001
Email ID:	praveenkumar.k@orangeretailfinance.com
Branch Address of the Contact Person	1st Floor, Door No. 22-2-11-10-1, Renigunta Road, Tirupathi, Andhra Pradesh- 517501.

All the Terms and Conditions of your loan remains unchanged.

Thank You for choosing Orange Retail Finance India Private Limited as your mobility and livelihood partner.

Registered Office: No. 4/363, 2nd Floor, Kandhanchavadi, Old Mahabalipuram Road, Chennai – 600096. Tel: 9585890000
Email: customercare@orangeretailfinance.com
CIN: U65191TN1989PTC018026

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE cum M.A.C.T, AT: VISAKHAPATNAM
M.O.P.296/2022

Between:
Viswanadhula Nagamani & others ...Petitioners
And:
Vummita Sitaram & 2 others ...Respondents

NOTICE

To,
R-1: Vummita Sitaram,
S/o. Chalapatirao, Hindu, aged 41 years, R/at D.No.10-4-27, Anasapurapu vari Street, Viziayanagaram

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against you and other respondents claiming compensation and the matter stands posted to **16-03-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **16-03-2023** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

B. RAMA GOPALA RAJU,
CH. GEETHA,
Advocates
Narsipatnam,
Cell: 9494189512